# ఎమ్వీయల్

# హనీమూన్



ఆ మూడు రోజుల్లోనూ కనీసం మూడు వందల సార్లయినా తన అత్తారింట గల సౌకర్యాలను, హాయిని, ఆనందాన్ని-అటు మున్సిపాలటీ యిటు పంచాయితీకి మధ్య వూగిసలాడుతూవున్న వూళ్ళో తనుంటున్న అద్దెయింటి అసౌకర్యాలను, బాధను, చిరాకును పోల్చిచూసుకుంటాడు రఘు.

పూల తోటల్లో సీతాకోకచిలుకలా, మావి గుబుర్లల్లో కోయిలలా, ఎవరూ ఆపలేని సెలయేరులా స్వేచ్ఛగా పెరిగిన లక్ష్మి రేపట్నించి తనతోపాటు అద్దె యింట్లో కాపరం చెయ్యబోతోంది. ఎవరైనా చూడటానికొస్తే పడకగదే డ్రాయింగ్‌రూముగా మారుతుంది. చుట్టాలొస్తే వంటిల్లు పడగ్గది అవుతుంది. ఆరు కాపరాలున్న యింట్లో తనది రెండు గదుల వాటా!

తిలక్ అన్నట్లు 'టెలివిజన్ సెట్‌లాటి బాత్రూం.' ఇవీ తను కల్పించే సౌకర్యాలు.

మరి యిక్కడ.

విశాలమైన తోటలో ప్రశాంతంగా వుండే పెద్ద బంగళా. చుట్టూ పూలచెట్లు. పిలవకుండా పలికే నౌకర్లు.

కాలు కింద పెట్టకుండా గారాబంగా పెరిగింది లక్ష్మి.

రఘు బ్యాంకులో క్లర్కుగా పనిచేస్తున్నాడు. లక్ష్మి తండ్రి రామచంద్రరావుగారు యాదృచ్ఛికంగా అతన్ని చూడ్డం జరిగింది. కుర్రాడి గురించి వాకబు చేశాడు. బ్యాంకు మేనేజరుతో సహా, తెలిసినవాళ్ళు నలుగురైదుగురు రఘు చాలా మంచి కుర్రాడనీ, అవకాశాలొస్తే దూసుకుపోయి ప్రమోషన్లు సంపాయించ గల తెలివితేటలున్నవాడనీ చెప్పారు. మీ అమ్మాయి లక్ష్మికి ఈడూజోడూ బావుంటుంది. ప్రయత్నంచెయ్యండి అని సలహా కూడా యిచ్చారు. రఘు ఆస్తిపాస్తుల గురించి, కట్నం సమస్య గురించి ఆయన ఆలోచించలేదు. రూపం, గుణం ప్రధానమనుకున్నారు. భార్య జయమ్మతో సంప్రదించారు. కూతురు లక్ష్మిని కదిపి చూశారు. ఇద్దరికీ అంగీకారంగానే కనబడింది. వెంటనే రఘు తల్లిదండ్రుల్ని కలుసుకున్నారు. ఓ పల్లెటూళ్ళో చిన్న యింట్లో వుంటున్న మధ్యతరగతి కుటుంబం వారిది. రఘు వారికి ఆశాదీపం. రఘు తండ్రి భాస్కర్రావుగారు పిల్లని చూడ్డం ముఖ్యం అనీ, అబ్బాయికి నచ్చాలి గదా అనీ పదే పదే చెబుతూనే వాణ్ణి బి.కాం. దాకా చదివించటానికి పది వేల దాకా ఖర్చయిందని కట్నాన్ని సూచనప్రాయంగా తెలియజేశారు. అయినా కట్నం గురించి తనకు పెద్దగా పట్టింపుల్లేవని కూడా పదేపదే చెప్పారు.

రామచంద్రరావుగారికి ఆయన అంతర్యం అర్థమైంది. పెద్దపిల్ల పెళ్ళి అతి వైభవంగా చేశాడాయన. అబ్బాయికి కట్నం తీసుకోకుండా పెళ్ళిచేసి పదిమందిలో సెభాషనిపించుకున్నాడు. పొలాలు, తోటలమీద ఏటా పాతిక వేల ఆదాయం వచ్చే రామచంద్రరావుగారికి పదివేలు కట్నం యివ్వటం కష్టంకాదు.

పెద్దలందరికీ అంగీకారం కుదిరింది. పెళ్ళిచూపుల తతంగం ముగిసింది. తాంబూలాలతోపాటు భాస్కర్రావుగారు పదివేల కట్నం కూడా అయ్యిష్టంగానే స్వీకరించారు.

కట్నం తీసుకున్న సంగతి పెళ్ళయాక తెలిసింది రఘుకి. తనతో చెప్పకుండానే తండ్రి చేసిన పనికి 'గిల్టీ'గా ఫీలయాడు.

'నీ చదువుకోసం చేసిన అప్పు ఎలా తీర్చమంటావోయ్. వున్న యిల్లు కాస్తా అమ్మేసి రోడ్డున పడమంటావా' అనే ఆయన మొండివాదం ముందు మాటాడి ప్రయోజనంలేదని రఘు తలవంచుకున్నాడు.

శోభనం రాత్రి జీవితంలో ఒకసారే వస్తుంది.

ఆ రోజు అత్తారింట జరిగిన హడావిడి యింతా అంతా కాదు.

రఘు పెళ్ళికూతురిలా సిగ్గుపడి పోయాడు. సిగ్గులమొగ్గలాగా గదిలో కొచ్చిన లక్ష్మిని దగ్గరకి తీసుకున్నాడు.

మల్లెపూలూ, అగరుధూపం మత్తెక్కించాయి. అయిదు నిమిషాలు ఎవరు ముందు మాట్లాడాలో తెలీక మౌనంగా వృథాగా గడిచిపోయాయి.

"అయామ్ సారీ లక్ష్మీ! మా నాన్నగారు కట్నం తీసుకున్న సంగతి నాకు తెలీదు." అన్నమాటతో నిశ్శబ్దం నిష్క్రమించింది.

లక్ష్మి తలెత్తి రఘు కళ్ళలోకి చూసింది.

"లక్ష లిచ్చినా మీలాంటి అల్లుడు దొరకడని మా నాన్నగారి అభిప్రాయం" అంది లక్ష్మి.

"అది ఆయన మంచితనం".

"కాదు—మీ గొప్పతనమేనట. అమ్మ కూడా ఆ మాటే చెప్పింది."

రఘుకి ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ కొద్దిగా తగ్గింది. కొత్త ధైర్యం కలిగింది.

"నా మీద మీ అమ్మానాన్నల అభిప్రాయాలు చెప్పావు. నీకు ఏ అభిప్రాయమూ లేదన్నమాట."

లక్ష్మి అతని గుండెల్లో మొహం దాచుకుని గువ్వలా వొదిగిపోయింది. 'యిదే నా అభిప్రాయం' అన్నట్లు.

తొలిరేయి తొందరగా తెల్లారిపోయింది. పగలంతా బావగారితో కలిసి పొలాలూ, తోటలూ తిరిగిరావటం పని. భోజనం, నిద్ర రెండో పని.

'చిన్నమ్మగారికి సరైన ఈడు జోడు' అని అతన్ని చూసిన వాళ్ళంటుంటే 'వింటున్నావా' అంటూ చేత్తో పొడిచేవాడు బావగారు రాజా.

మూడు రోజులు మూడు క్షణాల్లా గడిచిపోయాయి.

తను చేసే చిన్న వుద్యోగం గురించి తన కొచ్చే జీతం గురించి, కాపరం వుండాల్సిన రెండు గదుల యింటిగురించి, అరు కాపురాల యింట్లో బాత్రూం బాధల గురించి, పాలనుంచి పనిమనిషి వరకు అక్కడ సంసార్లు పడే బాధల గురించి ఆ రెండ్రోజులూ లక్ష్మికి చెపుతూనే వున్నాడు రఘు.

"మీరు ప్రవేట్ క్లాసులు బాగా తీసుకుంటారు" అంది లక్ష్మి .... చెప్పిందే చెబుతున్న అతని పద్ధతికి కిలకిలా నవ్వుతూ.

ఆ నవ్వుతో మెరుపులా ఓ ఆలోచన తట్టింది రఘుకి.

తనను ట్యూషన్ చెప్పమని అడగటానికి ఒకరిద్దరు బి. కాం. కుర్రాళ్ళు రావటం గుర్తొచ్చింది. బ్యాంక్ పరీక్షలకి ప్రిపేరవుతున్న తనకు టైముండదని చెప్పేశాను. వాళ్ళు వదిలిపెట్టకుండా మేనేజరుతో చెప్పించారు.

'పరీక్షలకి ప్రిపేరవ్వాలి గదా సార్' అన్నాడు తను.

"ఓ గంట స్పేర్ చెయ్యవోయ్ వాళ్ళకి. కుర్రాడివి, ఆ మాత్రం కష్టపడలేవా" అన్నారు మేనేజరుగారు.

"ఆలోచిస్తాను సార్" అన్నాడు అప్పటికి. ఆ తరువాత పెళ్ళిచూపులకి, పెళ్ళి పనులకీ అటూయిటూ తిరగటంలో మళ్ళా ఆ ప్రస్తావన ఆయన తేలేదు. కుర్రాళ్లూ కలవలేదు.

లక్ష్మి అన్నట్లు ట్యూషన్లు చెబితే నెలకి నాలుగయిదొందలు తేలిగ్గా సంపాయించవచ్చు.

మర్నాడే ప్రయాణం.

కొత్త కాపురానికి కావలసినవన్నీ కొనేసి అల్లుడిక్కూడా తెలియకుండా ముందే పంపించేశారు రామచంద్రావు గారు. కూతురు వెళ్ళిపోతున్నందుకు బాధపడుతున్న జయమ్మని ఓదార్చారు. ఎప్పటికైనా పంపక తప్పదు గదే పిచ్చిదానా! సంతోషంగా పంపించాలి. పెద్ద దూరా భారం కాదుగా! చూడాలనుకొన్నప్పుడల్లా వెళ్ళి చూడొచ్చు. ఓపిక లేకపోతే వార్తలు చేరెయ్యటానికి పోస్టల్ డిపార్ట్మెంటుంది."

కొత్తబట్టలు పెట్టిన అత్తమామలకు నమస్కరించాడు.

రామచంద్రరావుగారు అయిదువేల రూపాయలున్న కవరు రఘు చేతిలో పెట్టాడు.

"ఇదేవిటండీ" అన్నాడు రఘు.

"ఓ వారంరోజులు సెలవ పెట్టి ఎక్కడన్నా తిరిగిరండి. చుట్టాలిళ్లలో దిగితే యిబ్బంది పడతారు. నేనే టికెట్లు బుక్ చేయిద్దామనుకొన్నాను. కాని మీ అభిప్రాయాలు అభిరుచులూ ఎలావుంటాయో ....మా కాలంవాళ్ళకేం తెలుస్తుంది" అన్నారు.

"మదరాసో బెంగుళూరో అయితే మా బంధువుల బాధ తప్పదు. అనుభవంతో చెబుతున్నాను. ఏ హిల్ స్టేషన్కో వెళ్ళి ఓ వారం వుండిరండి బావా" అన్నాడు రాజా బావమరిది సరసంగా.

"వొద్దండీ" అని కవరిచ్చేశాడు రఘు. "సెలవ దొరకదు. పైగా పరీక్షకి ప్రిపేరవ్వాలి. హనీమూన్కి ఎప్పుడేనా వెళ్లొచ్చు వీలు చూసుకుని. లక్ష్మితో మాట్లాడి...." అని భార్యవంక చూశాడు. ఎటూ చెప్పలేక లక్ష్మి తలవంచుకుంది. అతని మొహమాటాన్ని అర్థంచేసుకున్న

రామచంద్రరావుగారు మరి బలవంతం చెయ్యదలుచుకోలేదు,

"పోనీ .... డబ్బు దగ్గరుంచుకోవే లక్ష్మీ" అంది జయమ్మ.

లక్ష్మి అప్పటికే రఘు మనస్తత్వాన్ని కాచి వడపోసినదానిలా "ఆయన కిష్టం లేదమ్మా'' అంది.

"నాకున్నంతలో మీ అమ్మాయి కష్ట పడకుండా చూసుకుంటాలేండి" అన్నాడు రఘు బలవంతాన నవ్వు తెచ్చుకుని. అక్కడితో హనీమూన్ ప్రపోజల్ ఆగిపోయింది.

* * *



రఘు యింటికి చేరగానే మూడు గదుల యింటికోసం వేట మొదలు పెట్టాడు. మూడొందలకి తక్కువలో యిల్లు దొరకదని తేలిపోయింది. అంటే జీతంలో సగం అద్దెకే హరించుకుపోతుంది. ప్రస్తుతానికి ఆ ప్రయత్నానికి వాయిదా వేశాడు.

లక్ష్మి వున్న రెండుగదుల్లోనే నాలుగు గదులు పట్టే సామాను పొందికగా సర్దింది.

'ఇచ్చట బి.కాం.కి ట్యూషన్లు చెప్ప బడును' అని బోర్డు కట్టకపోయినా స్టూడెంట్స్ పదిమంది వచ్చారు. పై సంపాదన పథకాన్ని ఆచరణలో పెట్టాడు రఘు.

పదిమందీ—యిరవై ముప్పై కావటంతో మూడు 'బాచ్'లు చెయ్యక తప్ప లేదు. ఇంటి వరండాలోనే 'ట్యూషన్' చెప్పటం. ఇంత శ్రమపడుతున్నా తన బ్యాంక్ పరీక్షలు అశ్రద్ధ చెయ్యలేదు.

తన పరీక్షలు, కుర్రాళ్ళ పరీక్షలు పూర్తయేసరికి లక్ష్మికి మూడో నెల. సూడిదలిచ్చి లక్ష్మిని యింటికితీసుకెళ్ళింది జయమ్మ. ప్రసవించేవరకూ అక్కడే వుండాలని పట్టుపట్టింది.

లక్ష్మి పుట్టింటి కెళ్ళాక రఘుకి 'హనీమూన్' సంగతి గుర్తొచ్చింది.

రెండు మూడు సందర్భాల్లో 'ఎక్కడైనా వెళ్ళొద్దామండీ' అని ఆమె ప్రస్తావించటం కూడా గుర్తొచ్చింది.

డబ్బున్నప్పుడు సెలవలేక, సెలవలు కుదిరినప్పుడు డబ్బు సమకూడక వాయిదా వేస్తూ వచ్చాడు రఘు.

వెళ్తే ఎక్కడికి వెళ్ళాలి అనేది మాత్రం యిద్దరూ తీవ్రంగా ఆలోచించే వాళ్ళు అప్పుడప్పుడూ.

ఇదే సినిమాల్లో అయితే పెళ్ళయిన మరుక్షణాన హీరో హీరోయిన్లు నిర్మాత ఓపికనిబట్టి ఊటీయో, కాశ్మీరో వెళ్ళి రెండు డ్యూయట్లు పాడి తిరిగొచ్చేసే వారు. కథ వేగాన్నిబట్టి హనీమూన్నించి తిరిగి రాగానే ఉయ్యాలతొట్టో, విలన్‌తో కయ్యాల ఫైటో ఏర్పాటవుతుంది. హిందీ సినిమా అయితే స్విట్జర్లాండో, ప్రపంచ విహారయాత్రో తప్పనిసరి.

మధ్య తరగతి కుటుంబాలవాళ్ళు ఏదీ లేకుండా తిరపతి ప్రయాణం పెట్టుకుంటారు, పుణ్యం పురుషార్థం రెండూ కలిసొస్తాయని. కాస్త 'ప్రొగ్రెసివ్' దృష్టి వున్న వాళ్ళయితే భార్యాభర్తలిద్దర్నీ పంపించి వూరుకుంటారు. పాతవాసనలు వదలని వాళ్ళయితే, పాతమొక్కులు కూడా ఈ దెబ్బతో చెల్లగొట్టేసుకోవచ్చని నలుగురు పెద్దలూ వెంటబడతారు.

ఒక కాలెండరు కనుమరుగైంది.

లక్ష్మి క్షేమంగా బాబుతో తిరిగివచ్చింది.

"తిరపతి వెళ్ళొద్దామా" అన్నాడు రఘు రానుపోను ఖర్చులూ, బ్యాంక్ బ్యాలెన్సూ లెక్కచూసుకుని.

"వీణ్ణి చంకనేసుకుని హనీమూనా? నేను లేకుండా వీణ్ణి ఒక్కరోజు సముదాయించండి చూదాం" అంది కొత్తగా వచ్చిన తల్లి హోదాతో—

రఘు మూడుగదుల యిల్లు సంపాయించగలిగాడు గాని లక్ష్మికి హనీమూన్ ముచ్చట తీర్చలేకపోయాడు.

"హనీమూనంటే సినిమా తారల జోకొకటి గుర్తొస్తోంది" అన్నాడు రఘు

"ఏవిటది" అంది లక్ష్మి బాబుకి పాలిస్తున్న ఆనందంలో ఆసక్తిని కలగలిపి.

"ఓ సినిమా నటుడు, నటి పెళ్ళిచేసుకున్నార్ట. హనీమూన్‌కి ఎక్కడికి వెళ్లాలి అన్న విషయంమీద యిద్దరికీ భేదాభిప్రాయాలొచ్చాయి. సిమ్లా అని ఒకరంటే స్విట్జర్లాండని మరొకరన్నారు. ఎవరి పంతం వాళ్ళు వదల్లేదు. కాని చివరికి ఒక ఒప్పందం కుదిరిందిట." సస్పెన్సు కథ చెబుతున్నట్లు ఆగాడు రఘు.

"నటుడు తన కోరిక ప్రకారం సిమ్లా వెళ్ళాట్ట. నటీమణి తన కోరిక ప్రకారం స్విట్జర్లాం డెళ్ళిందిట."

లక్ష్మి పగలబడి నవ్వింది—ఆ భార్యాభర్తల అన్యోన్యతకి.

పాలు తాగుతున్న బాబు ఉలిక్కిపడి ఏడవటం మొదలుపెట్టాడు. 'నేను లేకుండా ఎక్కడికి వెళ్తారన్నట్లు.'

"ఊర్కో బాబూ వూర్కో! నిన్నొదిలి మేం ఎక్కడికీ వెళ్ళంగా కన్నా" అని తొడమీద వున్న బాబుని వూపుతూ వూరుకోబెట్టింది లక్ష్మి.

* * *

పదిహేను కాలెండర్లు మారిపోయాయి. రఘు ప్రమోషన్ల మీద బ్యాంకు మానేజరయ్యాడు. కొడుకు మోహన్ ఇంటర్ పూర్తిచేశాడు. కూతురు రాధ టెన్త్‌లో కొచ్చింది.

బ్యాంకు వారిచ్చిన బంగళాలాంటి యింట్లో కాపరం.

రఘు రాఘవరావయ్యాడు. లక్ష్మి లక్ష్మీదేవి అయింది.

సంసార బాధ్యతలు పెరిగాయి.

రాఘవరావు మంచి పొజిషన్‌లోకి రావటంతో చుట్టపక్కాల తాకిడి ఎక్కువైంది.

రాఘవరావుకి రోటరీ క్లబ్బు లక్ష్మీదేవికి మహిళామండలి కాలక్షేప కేంద్రాలయ్యాయి

ఇద్దరూ ఏకాంతంగా గడపటం గగన కుసుమంగా మారింది.

పిల్లలు చిన్నవాళ్లుగా వుండగా ఒకసారి ఏకాంతంగా లక్ష్మితో గడపటానికి ప్లాన్ వేశాడు రాఘవరావు. పిల్లలిద్దర్నీ 'విరిసిన వెన్నెల' సినిమాకి పంపించాడు.

పున్నమి వెన్నెల్లో పూలపక్క వేసి శోభనంరాత్రి ఏర్పాట్లు చేశాడు. ఇప్పుడున్న యింట్లో బాత్రూమే పడకగదంత వుండటంతో 'టెలివిజన్ సెట్' అవుతుందన్న భయంలేదు. మేడలమీదుండే వాళ్లు చూడ్డానికి వీల్లేనంత ఎత్తున వున్నారు కాబట్టి ఎవరన్నా చూస్తారేమో ఏమైనా అనుకుంటారేమో అనే దిగుల్లేదు.

రాఘవరావు చేసే ఏర్పాట్లు పడే కంగారు చూసి నవ్వుకుంటూ తెల్లటి జరీ చీరలో వెన్నెల పువ్వులా నిలబడింది లక్ష్మి.

భోజనాలు పూర్తిచేసి, తాంబూలం సేవిస్తూ పెళ్లినాటి ఆల్బమ్ చూసి ఆ ముచ్చట్లు గుర్తుచేసుకుంటూ యిద్దరూ నవదంపతుల్లా సిగ్గులొలకబోశారు

రాఘవరావు లక్ష్మిని కౌగిట్లోకి తీసుకుని 'ఇదే హనీమూనంటే' అన్నాడు.

కాలింగ్‌బెల్ మోగటంతో కంగారుగా కౌగిలి వదిలేసి లుంగీ సరిచేసుకుంటూ వెళ్లి తలుపుతీశాడు. పిల్లలిద్దరూ గంటలో తిరిగొచ్చేశారు

"అది డబ్బింగ్ సినిమా డాడీ! పరమ బోరు ఫైట్లు లేవు....డాన్సులు లేవు." అంటున్న పిల్లలకి ఏంచెప్పాలో తెలీక "అలాగా! నాకు తెలీదు. ఒరిజినల్ అనుకొన్నాను" అంటూ వాళ్లు డ్రస్ మార్చుకునేంతలో బైటకి వచ్చి 'పిల్లలొచ్చేశారు' అంటూ పూలు కనబడకుండా పక్క చుట్టేశాడు.

* * *

పాతిక పంచాంగాలు పాతబడ్డాయి. కట్నం తీసుకోకుండా, చాదస్తాలకు పోకుండా ఆదర్శ వివాహం చేశాడు. భారీ ఎత్తున రిసెప్షన్ ఏర్పాటు చేశాడు. రిసెప్షనూ, విందూ సంగీతకచేరి పూర్తయాయి. మర్నాడుదయం రెండు ఎయిర్ టికెట్లు మోహన్ కిచ్చాడు రాఘవరావు.

"కాశ్మీర్ వెళ్లి పదిరోజులుండండి. అక్కడ అన్ని ఏర్పాట్లూ చేశాను" అన్నాడు.

తనకి తీరని కోరిక కొడుకయినా తీరాలని లక్ష్మీదేవి కొడుకూ కోడలికీ బట్టలు సర్దటంలో బిజీగా వుంది.

మోహన్ మొహం అదోలా పెట్టాడు "మేం హనీమూన్‌కి వెళ్లదలుచుకోలేదు డాడీ! మమ్మీ మీరు ఎక్కడుంటే అదే మాకు కాశ్మీరూ, కన్యాకుమారి" కోడలి అభిప్రాయం కూడా అలాగే కనబడే సరికి లక్ష్మీదేవి రాఘవరావువంక చూస్తూ నిలబడిపోయింది. రాఘవరావు టికెట్ల వంక చూస్తూ అలాగే వుండిపోయాడు. ఆ యిద్దరికళ్లలో కాశ్మీరు హిమపాతంలా కన్నీరు....కన్యాకుమారి సూర్యాస్తమయ సౌందర్యంలో రాగరేఖలు.

*("ప్రేమ యాత్రలకు బృందావనమూ, నందనవనమూ ఏలనో, ప్రేమించిన సతి ఎదురనుండగా.." అనే పాటను, ఆ పాత్రలను, ఆ సంఘటనను గుండమ్మకథలో పెట్టి "దీనికి ఇన్‌స్పిరేషన్ 'కళాపూర్ణోదయం'లో సుగాత్రీశాలీనుల కథ కదండీ" అని అడిగినప్పుడు 'అదేగదా మరి' అని జవాబిచ్చిన విజయా చక్రపాణిగారి స్మరణకోసం)*

—o—